రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న అంజదుల్లాఖాన్

చార్మినార్: సమాజంలోని పేదలను ఆదుకోవడానికి తమ పార్టీ ముందు నుంచి కృషి చేస్తోందని మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) పార్టీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్ అన్నారు. రంజాన్ మాసంలో పేద ప్రజలకు రంజాన్ కిట్ల రూపంలో నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. చంచల్‌గూడలోని దారుల్ అమన్ క్యాంప్‌లో యాకుత్‌పురా శాసన సభ నియోజకవర్గంలోని పలు బస్తీలకు చెందిన పేద ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలతో పాటు తమ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి తాము ఈ రంజాన్ కిట్లను అందజేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా రంజాన్ మొదటి శుక్రవారం ప్రార్థనలు



మాట్లాడుతున్న మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: రంజాన్ మాసం మొదటి శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. కార్వాన్, మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని జామా మసీదులు ప్రార్థనలకు వచ్చిన వారితో కిటకిటలాడాయి. గోల్కొండ అక్బరీ మసీదులో జరిగిన ప్రార్థనలకు కుతుబ్‌షాహీ ఈద్గా కతీబ్ మౌలానా కారీ మతీన్ అలీషా ఖాద్రి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన రంజాన్ మాసంలో దాన ధర్మాలు చేయడం, తరావీ ప్రార్థనలు చేయడం తదితర వాటిపై వివరించారు.

ఎన్‌సీసీ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ఎన్‌సీసీ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, మిలటరీ అధికారులు ఉమేష్ చంద్ర, ముత్యవేణి, లెఫ్టినెంట్ కల్నల్ సి.కార్తీక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలికి సీనియర్ విద్యార్థులకు వీడుకోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర ఆపద సమయాల్లో ఎన్‌సీసీ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: రంజాన్ సందర్భంగా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొన్ని శుక్రవారం ఆయన కార్పొరేటర్లతో కలిసి జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మసీదులు, ప్రధాన కూడళ్లలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రంజాన్ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం, రెయిన్‌బజార్, సంతోష్ నగర్ డివిజన్ల కార్పొరేటర్లు సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, ముజాఫర్ హుస్సేన్, జీహెచ్‌ఎంసీ సంతోష్ నగర్ సర్కిల్ డీసీ మంగతాయారు, ఈఈ ఏకాంబరం, ఏఈలు హఫీ, అన్సారీ, పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



ఛత్రినాకలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేసేందుకు ప్రతి కార్యకర్త ఉత్సాహంగా ఉన్నారని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని ఛత్రినాక చౌరస్తాలో బీజేపీ నాయకులు శుక్రవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కౌడీ మహేందర్, నాయకులు జమాల్‌పూర్ శేఖర్, మాదరి చంద్రశేఖర్, బర్ల శ్రీనివాస్, పొన్న శ్రీనివాసారావు, మహేందర్ రెడ్డి, డాక్టర్ పండరీ, వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు..మహారాణులు



చార్మినార్/సుల్తాన్‌బజార్/గౌలిపురా: పాతబస్తీలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో విధులు కొనసాగిస్తున్న మహిళా అధికారులు పురుషులకు దీటుగా ముందుకెళ్తున్నారు. ఏదైనా జఠిలమైన సమస్య తలెత్తినప్పుడు సావధానంగా ఆలోచిస్తూ ఆయా సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నారు. తమకు కేటాయించిన పనిని పూర్తి చేస్తూ విధినిర్వహణలో ఆశించిన ఫలితాలు సాధిస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది పని తీరుపై అన్ని స్థాయిలలోని అధికారులు అభినందనలు తెలియజేస్తున్నారు.

దక్షిణ మండలం పోలీసు విభాగంలో..

దక్షిణ మండలం డీసీపీగా స్నేహా మెహ్రా విధులు కొనసాగిస్తున్నారు. పాతబస్తీలోని దక్షిణ మండలంలో మహిళా ఐపీఎస్ అధికారిగా ఆమె అన్ని వర్గాల ప్రజల మెప్పు పొందుతున్నారు. అలాగే ఆమెతో పాటు పాతబస్తీలో మహిళా పోలీసు కానిస్టేబుల్స్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పురుషులకు దీటుగా పని చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్‌లో..

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో ముగ్గురు మహిళా అధికారులు డిప్యూటీ కమిషనర్లుగా పని చేస్తున్నారు. సర్కిల్–7 డిప్యూటీ కమిషనర్(డీసీ)గా మంగతాయారు కొనసాగుతుండగా..సర్కిల్–9 డీసీగా సరిత, సర్కిల్–10 డీసీగా అరుణ కుమారి తదితరులు విధులు కొనసాగిస్తున్నారు.

అందరి సహకారంతో..



జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్‌గా 14 నెలలుగా విధులు కొనసాగిస్తున్నా. మొఘల్‌పురాలోని డీసీ కార్యాలయంలో తాను క్రమశిక్షణతో క్రమం తప్పకుండా రోజు వారి విధులు కొనసాగిస్తున్నా. మా సర్కిల్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నా. అందరి సహాయ సహకారాలతో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పని చేస్తున్నాం. – సరిత, జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డీసీ

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు..



మహిళలకు గౌరవం, గుర్తింపు ఇస్తూ ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. ఓ మహిళగా పోలీసు విధులు నిర్వహిస్తూ మహిళలకు పూర్తిగా సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉంది. మహిళలు మరింతగా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజిక, వైద్య, విద్య రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నా. – కె.లక్ష్మి, ఎస్సై భవానీనగర్

మహిళా సాధికారతకు కృషి చేస్తున్నాం..



వైద్య ఆరోగ్యశాఖలో అడిషనల్ డైరెక్టర్ (అడ్మిన్)గా పనిచేస్తూనే మహిళా సాధికారత కోసం ఒక సంఘాన్ని ఏర్పాటు చేశాం. మహిళలపై అధికారులు ప్రదర్శిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో మహిళా హక్కుల కోసం పోరాడుతున్న వారిని ప్రోత్సహిస్తూ వారికి సన్మానాలు చేస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ అధికారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినా, వివక్ష ప్రదర్శించినా ఈ సంఘం అధ్యక్షురాలుగా ఎదుర్కొంటున్నాం. మహిళా ఉద్యోగులను చైతన్య పరుస్తూ వారి భద్రతపై శ్రద్ధ వహిస్తున్నాం. – శశిశ్రీ, వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్

సిటీ కాలేజీలో రమేశ్ బాబు ఛాయాచిత్ర ప్రదర్శన



కందుకూరి రమేశ్ బాబు ఛాయాచిత్ర ప్రదర్శను తిలకిస్తున్న విద్యార్థులు

చార్మినార్: సామాన్యుల జీవితాలలోని విభిన్న కోణాలను తన కెమెరా కన్నుతో బంధించే కందుకూరి రమేశ్ వైవిధ్యమైన ఫొటోగ్రాఫర్ అని సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిటీ కాలేజీలో సెలబ్రేటింగ్ ఉమెన్ హుడ్ పేరిట ఏర్పాటు చేసిన రమేశ్ బాబు ఛాయాచిత్ర ప్రదర్శన డాక్టర్ శుక్లా ప్రారంభించారు. రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా, రైటర్‌గా, ఫొటో గ్రాఫర్‌గా బహుముఖీనంగా కృషి చేస్తున్న రమేశ్ సామాన్యశాస్త్రం పేరుతో తీస్తున్న చిత్రాలతో సామాన్యులను సెలబ్రిటీలుగా నిలబెట్టాయన్నారు. స్త్రీల జీవితంలో బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు వివిధ దశలలోని సహజత్వాన్ని ఛాయా చిత్రాలుగా మలిచాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కన్వీనర్ డా.నీరజ, తెలుగు శాఖ అధ్యక్షుడు డా.కోయి కోటేశ్వరరావు, ఆంగ్ల ఆచార్యులు డా.శ్రీకాంత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ గ్రామీణ ప్రజలు సాంస్కృతిక రాయబారులనీ, సామాన్యుల బతుకుల్లోని అసామాన్య కళాతత్త్వాన్ని విశ్వానికి తెలియజేయాలనే సంకల్పంతోనే పాత్రికేయుడిగా రచయితగా ఉన్న తాను ఫొటోగ్రాఫర్‌గా మారినట్లు కందుకూరి రమేశ్ బాబు తెలియజేశారు. ఛాయాచిత్ర ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

రికాబ్ గంజ్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పి వేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చార్మినార్: ఘాన్సీబజార్‌లోని రికాబ్ గంజ్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి హైకోర్టు గేట్ నెం.5కు ఎదురుగా ఉన్న దుస్తుల స్టోర్ రూమ్ భవనంలోని 4వ అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తులు గల ఈ భవనంలోని నాలుగో అంతస్తులో జరిగిన ఈ అగ్ని ప్రమాదాన్ని అగ్నిమాపక సిబ్బంది, చార్మినార్ పోలీసులు ఎంతో శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. నాలుగు అగ్నిమాపక వాహనాలు సకాలంలో ఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ..ప్రమాదానికి గురైన భవనం వద్దకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. నీటి పైపులను ఏర్పాటు చేసుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాదానికి గల కారణాలతో పాటు నష్టం తదితర వివరాలు ఇంకా తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళా ఉద్యోగుల సంఖ్య పెరగడం మంచి సంకేతం



బహుమతులను అందజేస్తున్న సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్

గన్‌ఫౌండ్రీ: వివిధ ప్రభుత్వ శాఖలలో మహిళా ఉద్యోగులు పెరగడం మంచి సంకేతమని తెలంగాణ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కార్యాలయం చీఫ్ కమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. శుక్రవారం నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని సీసీఎల్‌ఏ తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఉన్నత విద్యాశాఖ, సీసీఎల్‌ఏ కార్యాలయంలో మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. సీసీఎల్‌ఏ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్‌ఏ కార్యదర్శి మకరందన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, సీసీఎల్‌ఏ యూనిట్ అధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



పృథ్వీరాజ్ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ తానాజీ నగర్‌కు చెందిన మల్లేష్ కుమారుడు పృథ్వీరాజ్(25) ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఎంతకి జాబ్ రాకపోవడంతో కొన్ని రోజులుగా తీవ్ర నిరాశ నిస్పృహలో ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం గమనించిన కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలి



మాట్లాడుతున్న పాషా ఖాద్రీ

శాలిబండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నమాజ్, తరావీలో ఖురాన్ పఠనం చేయాలని మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ అన్నారు. మక్కా మసీదులో మొదటి శుక్రవారం సామూహిక ప్రార్థనల అనంతరం ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రంజాన్ మాసంలో ముస్లింలు దానధర్మాలు చేయాలని.. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఉపవాసాలు ఉండాలన్నారు. రంజాన్ నెలలో చాలా మంది చందాల కోసం వచ్చి ఆ పైసలను దుర్వినియోగం చేస్తున్నారని..చందాలు ఇచ్చే ముందు అతని గురించి ఆరా తీయాలన్నారు. రంజాన్ మాసంలో తప్పకుండా జకాత్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, ఎమ్మెల్సీ రహమత్ బేగ్, జామే నిజామియా పీఆర్‌ఓ అన్వర్, పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ, మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాల పాల్గొన్నారు.

అన్ని మసీదుల వద్ద తాగునీటి ఏర్పాట్లు చేశాం



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని మసీదులకు సరిపడా తాగునీరు అందేలా ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని మసీదులకు నీటి సరఫరాపై మజ్లిస్ సీనియర్ నాయకులు, వివిధ మజీదుల నిర్వహణ కమిటీల వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రంజాన్ సందర్భంగా మసీదులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని దానికి అనుగుణంగా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, అబ్బాస్ తదితరులున్నారు.

కలెక్షన్ డబ్బుతో పరారైన ఇద్దరి రిమాండ్

సుల్తాన్‌బజార్: ఓ ఎలక్ట్రానిక్ సంస్థకు బురిడీ కొట్టించిన ఇద్దరు ఉద్యోగులను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శుక్రవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం..నవరంగ్ కాంప్లెక్స్‌కు చెందిన ప్రకాష్ చంద్ కుమావత్ ఓ ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తున్నాడు. ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఎలక్ట్రానిక్స్ వైర్లు సప్లయ్ చేస్తున్నారు. ఆయన వద్ద పనిచేస్తున్న గోషామహల్‌కు చెందిన అనిల్ వైష్ణవ్(27), ఆత్మారావు వైష్ణవ్(49) వ్యాపార కలెక్షన్ నిమిత్తం రూ.34,97,335లను వసూళ్లు చేసి పరారయ్యారు. ఈ మేరకు 29 సెప్టెంబర్–2024న బాధితుడు ప్రకాష్ చంద్ కుమావత్ సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎట్టకేలకు శుక్రవారం నిందితులను అరెస్టు చేశారు.

రాయల్ బెంగాల్ వైట్ టైగర్ దత్తత

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండేళ్ల రాయల్ బెంగాల్ వైట్ టైగర్(ఉత్సవ్)ను నగరంలోని నాస్ర్ బాయ్స్ పాఠశాల సీఈఓ ప్రిన్సిపాల్ మీర్ హమీదుద్దీన్ అహ్మద్ తన సహ సభ్యులతో కలిసి ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. జూ పార్క్‌ను తన బృందంతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. జూ నిర్వహణ వన్యప్రాణుల సంరక్షణపై హర్షం వ్యక్తం చేస్తూ తెల్లపులి దత్తతకు సంబంధించిన రూ.3 లక్షల చెక్కును రాష్ట్ర జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్ ఎస్. హీరేమంత్, జూ క్యూరేటర్ వసంతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాస్ర్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ మీర్ జమాలుద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

గౌలిపురా: గౌలిపురాలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల సమీపంలో పైకప్పు లేకుండా నోరు తెరుచుకొని ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్ సమస్యపై గత నెల 26న 'సాక్షి'లో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి శుక్రవారం ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌కు మరమ్మతు పనులను చేపట్టారు.



మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

గోషామహల్ నాలాలో కూలిన విద్యుత్ స్తంభాలు



గోషామహల్ నాలాలో పడిపోయిన విద్యుత్ స్తంభాలు

అబిడ్స్: గోషామహల్ నాలా పైకప్పు కొన్ని నెలల క్రితం కూలిపోవడంతో ఆ ప్రాంతంలో మరమ్మతులు చేస్తుండగా శుక్రవారం అకస్మాత్తుగా విద్యుత్ మెయిన్ లైన్ రెండు స్తంభాలు నాలాలో కూలిపోయాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోషామహల్–చాక్నివాడి ప్రధాన రహదారి మీదుగా ప్రవహించే నాలా పైకప్పు ఇప్పటికీ పలుమార్లు కుప్ప కూలిపోయింది. తాజాగా నెల రోజుల క్రితం గోషామహల్ ప్రధాన రహదారిపై నాలా కుప్పకూలిపోయిన విషయం విధితమే. నాలుగు నెలల్లో నాలుగు సార్లు పైకప్పు కూలిపోయినా అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తూ నాలా మరమ్మతులు నత్తనడకన చేపడుతున్నారు. శుక్రవారం నాలా మరమ్మతులు చేస్తుండగా సమీపంలోని రెండు విద్యుత్ స్తంభాలు నాలాలో కూలిపోయాయి. ఆ ప్రాంతంలో స్థానికులు ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ బేగంబజార్ డీఈ సరతుల్లా ఆధ్వర్యంలో కూలిన రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయానికి విద్యుత్ పునరుద్ధరణ చేపట్టినట్లు డీఈ వెల్లడించారు.

నాలా పనులను వెంటనే పూర్తి చేయాలి..

గోషామహల్ ప్రధాన రహదారి నాలా పనులను వెంటనే పూర్తి చేసి ఈ రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు. నెల రోజులుగా రాకపోకలు నిలిపివేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు విజ్ఞప్తి చేస్తే కనీసం నాలాలో కూలిపోయిన మట్టిని కూడా ఎత్తి వేయలేదని, ఇంకా ఎన్నడు ఎత్తివేసి పూర్తి చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, సురేష్ ముదిరాజ్, నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఆలా పురుషోత్తం డిమాండ్ చేశారు.

'వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని అమలు చేస్తూ చిన్నాచితక కాంట్రాక్టర్ల కడుపు కొడుతున్న వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్ బోర్డు కాంట్రాక్ట్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వాటర్‌బోర్డులో జరుగుతున్న విషయాలపై ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానం ద్వారా వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలయ్యారన్నారు. ఓపెన్ టెండర్ సిస్టమ్ అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి బీఆర్‌ఎస్ విధానాలను అమలు చేస్తూ ఇందిరమ్మ రాజ్యంలో పేద బడుగు వర్గాలకు న్యాయం చేయడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. తాను వాటర్‌బోర్డులో జరుగుతున్న వివరాలను సేకరించి కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి



గోల్కొండ: మహారాణి అహల్యాబాయి హోల్కర్ నేటి యువతులకు ఆదర్శమని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ గుంత లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంగ్ ఆధ్వర్యంలో వీరవనిత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోకమాత అహిల్యాబాయి తాను నమ్మిన సిద్ధాంతాలను తూచాతప్పకుండా పాటిస్తూ దేశ సౌభాగ్యం కోసం కృషి చేశారన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయలను గౌరవిస్తూ ఆమె చేసిన పోరాటం ఆమెలోని పోరాట పటిమను తెలిపిందన్నారు. అనంతరం ఆయన జీఎన్‌ఐటీఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్, పి.ప్రకాష్‌బాబు తదితరులతో కలిసి అహల్యాబాయి హోల్కర్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కె.శ్యామలదేవి, కోకన్వీనర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, భాగేశ్వరిరత్కల్, డాక్టర్ వి.రాఘవేందర్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సిల్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వాటర్‌బోర్డు ఎండీతో సమావేశమైన శ్రీనివాస్, సాయికుమార్ తదితరులు

అబిడ్స్: వాటర్‌బోర్డులో డ్రైనేజీ సిల్ట్ వాహనాల కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ సిల్ట్ వాహన యజమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో వాహనాల యజమానులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, సాయికుమార్ మాట్లాడుతూ..డ్రైనేజీ సిల్ట్ తీయడంలో సిల్ట్ వాహనాల కార్మికుల పాత్ర ఎంతో అమోఘమన్నారు. వారు ఎన్నో అనారోగ్యాలకు గురవుతున్నా ప్రతిరోజూ సిల్టు వాహనాల ద్వారా డ్రైనేజీ సిల్ట్‌ను బయటకు తీస్తూ నగర ప్రజలకు ఎంతో చేయూతనిస్తున్నారని వారు వివరించారు. ఈ సందర్భంగా వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. డ్రైనేజీ వాహనాల కార్మికులకు సమస్యలు, యజమానుల సమస్యలను తన దృష్టికి తెస్తే వేగవంతంగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రామ్‌చందర్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ట్రెజరర్ సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి



పులిపాటి రాజేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న గంగపుత్ర సంఘం ప్రతినిధుల బృందం

చార్మినార్: గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అలియాబాద్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఆయనతో సమావేశమయ్యారు. ఆయనను కలిసి సత్కరించిన అనంతరం తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాజేశ్ కుమార్ మాట్లాడుతూ..గంగపుత్రుల స్థానిక సమస్యలను పరిష్కరించడానికి వెంటనే సంబంధిత అధికారులతో సమావేశమవుతానన్నారు. సాధ్యమైనంత వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో అలియాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దర్పాలీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లెల పురుషోత్తం, ఉపాధ్యక్షుడు ఆనందేశి ప్రవీన్, ముఖ్య సలహాదారులు ఆనందేశి అర్జున్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ గుంటి బసంత్‌రావు, అదనపు ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలకు వెళ్లే వరకు పండుగలకు దూరం



డైరీని ఆవిష్కరిస్తున్న మహ్మద్ ఫిరోజ్ ఖాన్

నాంపల్లి: ప్రజలకు ఏదైనా సేవ చేయాలన్న తపనే తనను ముందుకు నడిపిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం రెడ్ హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో జరిగిన ఐఎన్‌టీయూసీ గుర్తింపు పొందిన తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నిలోఫర్ యూనిట్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ సభకు హాజరై ఆయన కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. చట్టసభలకు వెళ్లే వరకు రంజాన్, బక్రీదు పండుగలకు దూరంగా ఉంటానని ఆయన శపథం చేశారు. నిలోఫర్‌లో జరిగే డైరీ ఆవిష్కరణ సభకు కారులో వస్తూ ఉంటే మా అమ్మ ఫోన్ చేసి కాసేపు మాట్లాడినట్లు వివరించారు. రంజాన్ మాసం శుక్రవారం ప్రార్థనల్లో నీకోసం, నీ తపన కోసం ప్రత్యేక ప్రార్థన చేశాను. ఎమ్మెల్యే కోటాలో భర్తీ చేసే ఎమ్మెల్సీ పదవి నీకు ఇవ్వాలని కోరాను. నీకు తప్పకుండా వస్తుంది బిడ్డా అంటూ తనతో చెప్పినట్లు పేర్కొన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ..నిలోఫర్ యూనిట్ కేలండర్, డైరీ ఆవిష్కరణ సభకు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్‌ను ఆహ్వానిస్తే గైర్హాజరు అయ్యారని విమర్శించారు.